## క్లుప్తంగా

### పాలుట్ల రంగనాథస్వామికి పల్లకీ బహూకరణ



దాతలను సత్కరిస్తున్న అర్చకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె కొండల్లో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత పాలుట్ల రంగనాథ స్వామి ఆలయానికి భక్తులు పల్లకీని బహూకరించారు. వెల్దుర్తి మండలం రామళ్ల కోట గ్రామానికి చెందిన రాధాగోపాల్, భారతి దంపతులు సుమారు రూ. 85 వేల పల్లకీని ఆలయ అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులకు అందజేశారు. దాతలను స్వామివారి పట్టువస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### కార్గో సేవలను వినియోగించుకోండి

కోవెలకుంట్ల: ఆర్టీసీ ద్వారా అందిస్తున్న కార్గో పార్సిల్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోవెలకుంట్ల డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డోర్ డెలవరీ సేవలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి నవంబర్ 25వతేదీ వరకు ప్రచార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్సిల్స్‌ను ఆర్టీసీ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్గో ద్వారా ఎనవలప్ కవర్ నుంచి 50 కిలోల వరకు పార్శిల్స్‌ను డోర్ డెలవరీ చేస్తున్నామన్నారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

### గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



పొలాలకు వెళ్లే దారిని ప్రారంభిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల : మండలంలోని గ్రామాలను దశలవారీగా ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తవిసికొండ గ్రామాలో రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన పొలాల రహదారిని ఎంపీపీ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు చింతల నాగిరిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, రామనాయుడు,గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత డ్రోన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె : మండలంలోని యాగంటిపల్లె రహదారిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో ఉచిత డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ బుధవారం తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఇంటర్, ఆపై చదివిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా మూడు నెలల పాటు డ్రోన్ సర్వీస్‌పై శిక్షణ ఇవ్వనునట్లు ఆమె తెలిపారు.

### నేడు మీరాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్ : మండలంలోని మీరాపురంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. డాక్టర్ శివశంకరుడితో పాటు పలువురు వైద్యనిపుణులు వైద్యులు ప్రజలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు.

**నేడు పెట్నికోటలో హెల్త్ క్యాంప్**

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట గ్రామ సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నలుగురు స్పెషలిస్టు డాకర్లు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని,పెట్నికోట,నాయినపల్లె గ్రామాల ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

### వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

డోన్: వాల్మీకి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట సమితి కార్యదర్శులు శీలం భాస్కర్‌నాయుడు, పూల శ్రీను, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, వీఆర్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వలసల రామకృష్ణ, కౌన్సిలర్ ఆర్ట్ రమణలు పిలుపునిచ్చారు. స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద శనివారం నిర్వహించనున్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలను జయప్రదం చేసేందుకు వాల్మీకి సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టెంకాయల కేశవయ్య, డీలర్ కృష్ణ, రాంపల్లె వెంకట్రాముడు పాల్గొన్నారు.

# పేదలకు నేరుగా సంక్షేమ ఫలాలు

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కుల మతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారన్నారు. మధ్యవర్తి అనే మాటా లేకుండా అర్హులందరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో బుధవారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ మాట్లాడుతు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటే ఇంత కంటే మెరుగైన పాలన వస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం వర్తించిందని గుర్తు చేశారు. సంక్షేమంతో పాటు పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. గతంలో ఏచిన్న పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో గ్రామాల్లోనే చక్కటి పాలన అందుతుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే ఠంఛన్‌గా పింఛన్ తెల్లవారు జామునే వలంటీర్లు తలుపు తట్టి అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పరిపాలన ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందో ఒక్కసారి ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి,గ్రామ నాయకులు జగన్, గిరి, అమర్‌నాథ్, కుమార్, పుల్లారెడ్డి, వీరనారాయణరెడ్డి, సుంకప్ప, కృష్ణ, రంగస్వామి, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ నాయకుల చేతుల్లో ఇళ్ల పట్టాలు!**

ఇళ్ల పట్టాలను తమకు ఇవ్వకుండా టీడీపీ నాయకులు వారి చేతుల్లో పెట్టుకున్నారని చల్లా కాలనీ వాసులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 20 ఏళ్ల క్రితం కాలనీలో ఇళ్ల స్థలాలతో పాటు పట్టాలు ఇవ్వడంతో గృహాలు నిర్మించుకున్నామన్నారు. టీడీపీ నాయకులు తమ ఇళ్ల పట్టాలను వారి దగ్గరే ఉంచుకుని తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో తమకే ఓట్లు వేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఎదటు బాధితులు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌తో చర్చించి కాలనీ వాసుల వివరాలు సేకరించి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

**చిన్న తిక్కన్న కుటుంబానికి అత్యధికంగా రూ.5.70 లక్షల లబ్ధి**

గొర్విమానుపల్లెలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని ఆయా కుటుంబాకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను అందజేశారు. అయితే అత్యధికంగా చిన్న తిక్కన్న కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో ఏకంగా రూ.5.70 లక్షల లబ్ధి చేకూరింది. ఈ వివరాల మేరకు లబ్ధి చేకూరిందా.. లేదా అని చిన్న తిక్కన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అడిగారు. అన్ని పథకాలు వర్తించాయని వారు సంతోషం వ్యక్తం చేశారు.

### నేడు జాబ్ మేళా

బేతంచెర్ల: పట్టణంలోని జ్ఞాన సరస్వతీ డిగ్రీ కళాశాల ఆవరణంలో గురువారం ప్రసిద్ధ ఫార్మా స్యూటికల్ కంపెనీ హెటిరోలో ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బుధవారం తెలిపారు. 2020 నుంచి 2023 బీఎస్సీ(కెమిస్ట్రీ) బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో డిగ్రీ, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా పీజీ, బీఫార్మసీ, ఐటీఐ, ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ అభ్యర్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో నియామకాలు నిర్వహించి ఎంపిక పత్రాలను అందజేస్తారని వివరించారు.

### పొదుపు మహిళల అభివృద్ధికి కృషి చేయండి

బేతంచెర్ల: అందరూ బాధ్యతగా విధులు నిర్వహించి పొదుపు మహిళల అభివృద్ధికి కృషి చేయాలని వైకేపీ ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని వేకై పీ కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ట్రెజరర్ కన్యకుమారి ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి, జగనన్న తోడు, ఉన్నతి రుణాలపై సీసీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు సూరిబాబు, రామకృష్ణ, వెంకటేష్, మహేశ్వరమ్మ, అకౌంటెంట్ నాగరాజు పాల్గొన్నారు.

## కోట్రాయిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డోన్ రూరల్: మండల పరిధిలోని కోట్రాయి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ భూపాల్ ప్రజలను ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ క్యాంప్‌లో దాదాపు 211మంది వైద్య సేవలు పొందారని ఎంపీడీఓ తెలిపారు. వైద్యనిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆశావర్కర్లు, అవగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



తూకాన్ని పరిశీలిస్తున్న ఖాజా హుస్సేన్

డోన్ టౌన్ : తుకాల్లో, నాణ్యతకు సంబంధించి ప్రజలను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ అధికారి ఖాజా హుస్సేన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ కూరగాయల మార్కెట్‌తో పాటు రోడ్లపై, ఆటోల్లో పండ్ల విక్రయదారుల కాటాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ కాటా, సాధారణ కాటా తుకాల గురించి వివరించారు. తూకానికి సంబంధించి అనుమానం వస్తే వెనుక ప్రభుత్వ సీలు చెక్ చేయాలని సూచించారు. అలాగే కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై ప్యాకింగ్, తయారీ తేదీలు, కంపెనీ అడ్రస్ తదితర వివరాలు ముద్రించి ఉండాలన్నారు. ఈ వివరాలు లేనిపక్షంలో దుకాణం యజమానిని ప్రశ్నించాలని వినియోగదారులకు సూచించారు.

## కోలుకోలేక మహిళ మృతి

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన పీర్ల రజియాబీ(40) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిందని ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. పీర్ల రజియాబీ మంగళవారం ఇంట్లో కట్టెల పొయ్యి అంటుకోవడంలేదని పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి చీరకె అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు మంటలార్పేలోపే ఆమె తీవ్రంగా గాయపడింది. కుంటుంబ సభ్యులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్సల అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి కుమారుడు పీర్ల నబిరసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు**

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొచ్చెర్వు వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నపుకుంటకు చెందిన మద్దమ్మ, రాధిక, మద్దిలేటి బైక్‌పై ప్యాపిలి మండలంలోని హుసేనాపురానికి వెళ్తున్నారు. అదేవిధంగా ప్యాపిలి మండలంలోని ఊటకొండకు చెందిన జనార్ధన్‌రెడ్డి, ఈశ్వర్ బైక్‌పై డోన్‌కు బయలుదేరారు. ఈ బైక్‌లు కొచ్చెర్వు సుంకులమ్మ గుడి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. మద్దిలేటి, మద్దమ్మలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. అలాగే జనార్ధన్‌రెడ్డి, ఈశ్వర్ కూడా గాయాలు తీవ్రంగా కావడంతో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించినట్లు వివరించారు.

## 28 నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

సంజామల: మండల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి, రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రాచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. నాలుగురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రెడ్డి హాజవుతారని, ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. కానాల గ్రామంలో ఈ నెల 28,29 తేదీలలో మధ్యానం 3 గంటల నుంచి ఎమ్మెల్యే కాటసాని గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా కమలపూరి సచివాలయ పరిధిలోని కమలపూరి, బొందలదిన్నె, వసంతాపురం, నట్లకొత్తూరు, హోత్రందిన్నె గ్రామాలలో 30, 31 తేదీలలో ఉదయం 7 గంటల నుంచే ఎమ్మెల్యే పర్యటిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## బీమా సాయం అందజేత




బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేస్తున్న దృశ్యం

డోన్: స్థానిక 30వ వార్డు పరిధిలోని శ్రీనివాస టాకీస్ వద్ద నివసిస్తున్న ఎరుకలి రాము(30) మృతి చెందాడు.ఈ మేరకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మృతుడి భార్య కమలవాణికి రూ. 10వేలను కౌన్సిలర్ ఆర్టరమణ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అధికారిణి అలివేలు, వలంటీర్లు కుళ్లాయి, ఈశ్వరి, శకుంబీ పాల్గొన్నారు.

## ఏళ్లనాటి కల సాకారం..!

- రూ. 55 లక్షలతో జుర్రేరు వాగుపై కల్వర్టు నిర్మాణం
- రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు
- రేపు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



జుర్రేరువాగుపై రూ. 55 లక్షలతో నిర్మించిన కల్వర్టు



రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు

కోవెలకుంట్ల: జుర్రేరు వాగుపై కల్వర్టు లేక రెండు గ్రామాల ప్రజలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయి. కోవెలకుంట్ల మండలం అమడాల– బిజనవేముల మధ్య జుర్రేరు వాగుపై కల్వర్టు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు దాటేందుకు అష్ట కష్టాలు తప్పేవి కాదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అమడాలలో పర్యటించగా గ్రామస్తులు వాగు కష్టాలను విన్నవించారు. స్పందించిన కాటసాని వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ. 55 లక్షలు నిధులు మంజూరు చేయించారు. కల్వర్టుతోపాటు ఈ రహదారిలో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం నిధులు రూ. 20 లక్షలు కేటాయించారు. ఈ మేరకు ఆ నిధులతో చేపట్టిన కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణాలు ఇటీవలే పూర్తయ్యాయి. ఈ మేరకు కల్వర్టుతోపాటు సీసీ రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నట్లు సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకరయ్య, కాంట్రాక్టర్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా వాసవీమాత వసంతోత్సవం



దుర్గా మాతను ఊరేగిస్తున్న దృశ్యం



రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న చిన్నారులు, యువకులు



వసంతోత్సవంలో పాల్గొన్న యువకులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారిశాల్లో వెలసిన వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఆర్యవైశ్యులు, యువకులు రంగుల్లు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కందగడ్డల మోహన్‌రావు, జయచంద్ర, శేషా మోహన్, శేఖరయ్య ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు రాజేంద్ర,విష్ణు, జనార్ధన్, లక్ష్మినారాయణ బల్లాని సూర్య తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని వివిధ కాలనీల్లో కొలువుంచిన అమ్మవార్ల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కళాలకారుల చెక్క భజనలు, దుర్గామాత, కాలికామాత, శివుడు వేశధారణలు, డప్పు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

**వైభవంగా వాసవీమాత గ్రామోత్సవం**

ప్యాపిలి: విజయదశమి వేడుకల్లో భాగంగా బుధవారం వావవీమాత ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరీ ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఆర్యవైశ్యులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య యువకులు, చిన్న పిల్లలు పరస్పరం రంగులు చల్లుకుని వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. వాసవీమాతను దర్శించుకున్న ప్రజలు అమ్మవారికి ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ముగిసిన మహోత్సవాలు**

బనగానపల్లె రూరల్ : స్థానిక కొండపేటలోని శ్రీవాసవీకన్య కాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సోవాలు బుధవారం వసంతోత్సవం, పాన్పుసేవ, తోట్ల పూజ కార్యక్రమంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆర్యవైశ్య సంఘం పెద్దలు, యువకులు వసంతోత్సవంలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఆలయం నుంచి పాతబస్టాండ్, పోలీసు సర్కిల్ కార్యాలయం, తపాలా కార్యాలయం, ఆస్థానం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రధాన రోడ్లులో గ్రామోత్సవం సాగింది.

**భక్తిశ్రద్ధలతో శోభ యాత్ర**

డోన్ టౌన్ : దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారి విగ్రహాలకు పట్టణంలో ఘనంగా శోభ యాత్ర నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో పూజలందుకున్న అమ్మవార్ల విగ్రహాలను సాయంత్రం పట్టణ పుర వీధుల గుండా ఊరేగించారు. శోభయాత్రలో బాలికల అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి.



బేతంచెర్ల పట్టణంలో దుర్గామాత విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



అమ్మవారి వేషధారణలో బాలికలు

### నేడు రంగాపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో టౌన్ ఫీడర్ కింద ఉన్న గృహాలు, పరిశ్రమలకు గురువారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూదన్‌రెడ్డి తెలిపారు. రహదారి విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### డేటా ఎంట్రీపై ఉచిత శిక్షణ

డోన్ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీలో ఉన్న బుగ్గన శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి సెంటర్‌లో నవంబర్ 3వ తేదీ నుంచి 3 నెలల పాటు విద్యావంతులైన నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. మూడు నెలలు శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుతో సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు.

### రెండవ విడత భూసర్వే పకడ్బందీగా చేపట్టాలి

బనగానపల్లె రూరల్ : మండలంలో రెండవ విడతలో చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జీ తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై వీఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడత భూముల రీ సర్వే ఎనిమిది రెవెన్యూ గ్రామాల్లో పూర్తి చేయడం జరిగిందన్నారు. రెండవ విడతలో భాగంగా మండలంలో బీరవోలు,నందివర్గం,వితలాపురం,కాపులపల్లె ఇల్లూరుకొత్తపేట, పాతపాడు, చెరువు పల్లె,యనకండ్ల, క్రిష్ణగిరి అప్పలాపురం,వెంకటాపురం రెవెన్యూ గ్రామాల్లో చెపట్టాల్సి ఉందని, ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఆర్‌ఓలు సురేష్‌రెడ్డి, సురేంద్ర,గోపాల్,మధు తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేశ్వరరెడ్డి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. కొద్ది రోజులుగా ఇక్కడ డీటీ పోస్టు ఖాళీగా ఉంది. జిల్లా కలెక్టర్ సీసీగా పని చేస్తున్న నాగేశ్వరరెడ్డిని కొలిమిగుండ్ల డీటీగా నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### 31న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ భారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ నియమకాలు చేపడుతారన్నారు. ఉత్పత్తి, నాణ్యత, ఇంజినీరింగ్ విభాగాల్లో ఉద్యోగ నియమాకాల కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్పత్తి విభాగానికి డిగ్రీ, నాణ్యత విభాగానికి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మెకానికల్ డిప్లొమో, ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, 2020 –2023 మధ్యలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఆసక్తి అభ్యర్థులు 31వ తేదీ ఉదయం 9గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

### ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్‌గా మరియదాసు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపాన ఉన్న ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్‌గా మరియదాసు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బండి ఆత్మకూర్ మోడల్ స్కూల్లో పనిచేస్తున్న మరియదాసు రెగ్యూలర్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### ఆరోగ్యశ్రీ యాప్‌లో బనగానపల్లె మండలం ప్రథమస్థానం

బనగానపల్లె:ఆరోగ్య శ్రీయాప్‌లో సీటిజన్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయడం బనగానపల్లె మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీఓ శివరామయ్య బుధవారం తెలిపారు. గత నాలుగు రోజులుగా ఈ కార్యక్రమం చేపట్టడడం జరిగిందని, మండలంలో 7,196 మంది మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల చివరి వరకు కొనసాగుతుందన్నారు.

### మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సంజీవరెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక మోడల్ స్కూల్‌కు ప్రిన్సిపాల్‌గా సంజీవరెడ్డి బుధవారం విధుల్లో చేరారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి తెలిపారు. శిరివెళ్ల మోడల్ స్కూల్‌లో పని చేసే సంజీవరెడ్డి ప్రిన్సిపాల్‌గా కొలిమిగుండ్లకు వచ్చారన్నారు. ఆయనకు ఉపాధ్యాయుల బృందం బొకెలు అందజేసి స్వాగ తం పలికారు. అదేవిధంగా ఇంగ్లిష్, అర్థశాస్త్ర ఉపా ధ్యాయులుగా గోవిందు,దాదాపీర్ విధుల్లో చేరారు.

### గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ

డోన్ టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టు భర్తీ కోసం గెస్ట్ ఫ్యాకల్టీగా నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ భారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్‌లో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీ ర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. యూజీసీ నెట్ ఏపీ సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్‌తో 28వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు.